

వాటర్ ప్లాంట్లల్లో విజిలెన్స్ తనిఖీలు

రాజంపేట అర్బన్: మండల పరిధిలోని మదన భోపాల పురంలోని శ్రీసాయి గంగా, కొత్త బోయినపల్లిలోని శ్రీ గంగా మినరల్ వాటర్ ప్లాంట్లను శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారి పి.రామకృష్ణ, వ్యవసాయ అధికారి ఇ.బాలగంగాధర్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి శంషుద్దీన్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్లకు సంబంధించిన అనుమతులు, వినియోగిస్తున్న పరికరాలను తనిఖీ చేశామన్నారు. నీటి శుద్ధి విధానాన్ని, ఉత్పత్తిని, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వాటర్ ప్లాంట్‌లో తయారైన నీటి నమూనాను సేకరించి పరీక్షలకు పంపించారు. ఈ తనిఖీలలో బయటపడిన విషయాలను ఒక నివేదిక ద్వారా ప్రభుత్వానికి అందజేస్తామని పేర్కొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పిడిఎఫ్ అభ్యర్థి నామినేషన్‌కు తరలిరండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి

కడప అర్బన్: రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు నామినేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని సిఐటియు కడప జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ శివశంకర్‌రెడ్డి, కె.వి.రమణారెడ్డి, సుబ్బారాయుడుకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, ఉదయం 10 గంటలకు అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని, తప్పకుండా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు, మహిళా సంఘాలకు, న్యాయవాదులకు, ప్రజాసంఘాల నాయకులకు, కాంట్రాక్టు ఉద్యోగులకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, రచయితలకు, మేధావులకు, ఉద్యమ నేతలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వ్యతిరేకంగా ప్రమాదంలో ప్రజాస్వామ్యం పడిందని, ప్రజల హక్కుల కాలరాస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పాలన సాగుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకుని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడున్నర సంవత్సరాల కాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షాలను అడుగడుగునా అనగదొక్కడానికి రాజ్యాంగ ఉల్లంఘన చేస్తున్నారని వాపోయారు. చట్టాలను గౌరవించకుండా ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులు బనాయిస్తూ పాలన కొనసాగించడం జగన్మోహన్ రెడ్డికి అలవాటైపోయిందని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో సభ నిర్వహించకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణం అన్నారు. ఉదయం సభకు అనుమతి ఇచ్చి సాయంత్రం అనుమతి లేదని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను పోలీసులు రెచ్చగొట్టి లాఠీచార్జి చేయడం శాంతి భద్రతలకు విఘాతం కల్పించడం వైసిపి ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు జెడ్ ప్లస్ భద్రత కలిగి ఉన్న నాయకునికి ట్రాఫిక్ క్లియర్ చేయించాల్సిన బాధ్యత పోలీసుపై ఉందని చెప్పారు. అలాంటి పోలీసులు నడిరోడ్డుపై ఆయన కాన్వాయ్‌కి అడ్డంగా రోడ్డుపై ధర్నాకు దిగడం చూస్తే శాంతి భద్రతలు రాష్ట్రంలో ఎంత క్షీణించాయో అర్థమవుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు ముగింపు పలుకుతారున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష ,పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదరవల్లి, మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, పట్టణ యువత అధ్యక్షులు ఇనాముల, యూనిట్ ఇన్‌చార్జ్ హుసేన్ , సాయి ప్రతాప్ , న్యూఆంధ్ర ముబారక్ , సోనీ రాజ్ కలిమ్, అమావాస్య రెడ్డేయ్య, సర్దార్‌వలిఖాన్, పట్టణ ఉపాధ్యక్షులు రెహ్మాన్, గంగాధర్, మహబూబ్‌బాష, మహబూబ్ అలీఖాన్, జావిద్, సాయి, హాజీ మన్సూర్, శివారెడ్డి , రవి రెడ్డి పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు


మాట్లాడుతున్న బాదుల్లా

దూదేకులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలి

- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్

దూదేకుల ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని దూదేకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా కోరారు. శనివారం సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టంలో దాదాపు 20 లక్షల జనాభా ఉన్నప్పటికీ స్వాతంత్ర్య భారతదేశంలో ఇప్పటికీ చట్టసభల్లో దూదేకులకు ప్రవేశం కల్పించలేదని చెప్పారు. చట్టసభల్లో ప్రవేశం లేని జాతి భవిష్యత్తులో అంతరిస్తుందని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ చెప్పారని పేర్కొన్నారు. తమ సమస్యలు, బాధలు చెప్పేందుకు ఒక ప్రతినిధి కావాలి కాబట్టి అత్యంత వెనుకబడిన కులమైన దూదేకుల సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని కోరారు. మైనారిటీలో ఒక భాగమైనటువంటి దూదేకుల సామాజిక వర్గానికి రాబోవు స్థానిక సంస్థల, గవర్నర్ కోటాలో ఒక ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకి, ప్రజలకు సేవ చేసే వారికి కేటాయిస్తారని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూరు కుళాయప్ప, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పాపాసాబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పోగాలం వచ్చింది

- టిడిపి నేతలు సోమిరెడ్డి, శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

విభజన ఆంధ్ర ప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకుంటున్న వైసిపి ప్రభుత్వానికి పోగాలం వచ్చిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు. ఈ నెల 25న చంద్రబాబు విచ్చేసే రాయలసీమ జోన్ సమావేశ సభాస్థలిని, కడప ఎయిర్‌పోర్టు సమీప ప్రాంతాన్ని శనివారం టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణను చూసి జగన్ జీర్ణించుకోలేని పరిస్థితి అన్నారు. చంద్రబాబు అనపర్తిలో సమావేశం నిర్వహించుకునేందుకు ఈ ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. టిడిపి హయాంలో వై.ఎస్ .రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి, షర్మిల పాదయాత్రలు చేసినప్పుడు అడ్డుకున్నామా అని గుర్తు చేశారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేశారని, ఇప్పుడు రాష్ట్రంలో అదే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని, ప్రజాస్వామ్యం కోసం పోరాడాల్సిన కర్మ దాపురించిందని చెప్పారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉందని చెప్పి, ఒక్కో ఊరిలో ఒక్కో రాజ్యాంగాన్ని జగన్ అమలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు పర్యటనను, లోకేష్ పాదయాత్రను ఈ ప్రభుత్వం అడ్డుకుంటుందని చెప్పారు. తెలుగుదేశం అధికారులకు వచ్చాక మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.


మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నేడు ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్ష

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలో ఈనెల 19న నిర్వహించబోయే ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి కె.కె. అన్బురాజన్ పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు ఉంటుందని తెలిపారు. పరీక్షల సమయం కంటే గంట ముందే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. నిర్ణీత సమయానికి ఒక నిముషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరని, అభ్యర్థులు గమనించాలని తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన 11 పరీక్షా కేంద్రాలలో మొత్తం 9540 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. 11 కేంద్రాలను నాలుగు రూట్లుగా విభజించి బందోబస్త్ ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. దీంతో పాటు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ గుర్తింపు కార్డు, పాన్ కార్డు గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి ఒరిజినల్ తీసుకురావాలని తెలిపారు. సెల్ ఫోన్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ అక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎగ్జామ్స్ సెంటర్ల వద్ద డిఎస్పి స్థాయి అధికారి నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.

తాహిర్ ట్రోఫీ-2023 విజేత కెకెఆర్

కడప: కడప నగరంలో క్రికెట్ గ్రౌండ్‌లో కడప కింగ్ రైడర్ ఆధ్వర్యంలో జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన తాహిర్ ట్రోఫీ -2023 లో విజేతగా కెకెఆర్ -11 జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా రైసింగ్ కెకెఆర్- 11 నిలిచింది. శనివారం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అల్ ఇండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ జిల్లా అధ్యక్షుడు పి వి రమణ, డాక్టర్ సొహైల్ అహ్మద్, డాక్టర్ నాజిముదీన్, విద్య సాధన డిగ్రీ కాలేజెస్ చైర్మన్ మన్సూర్ అలీఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ఎవరూ అసంతృప్తి చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. క్రీడాకారుల ప్రోత్సాహం కోసం ఇలాంటి ట్రోఫీ నిర్వహించిన కెకెఆర్‌ను, తాహిర్‌ను వారు అభినందించారు. కార్యక్రమంలో జన వికాస్ రాష్ట్ర కార్యదర్శి యునుసు, వాజీద్, వెంకటేష్, వాలేపు శివ పాల్గొన్నారు.

ఇకెవైసి...34 శాతమే!

- జిల్లాలో సా..గుతున్న నమోదు
- మూడు సార్లు గడువు పొడిగించినా సాగని ప్రక్రియ
- వేల మంది రైతులు నమోదుకు దూరంగానే...
- నెలాఖరుకు వంద శాతం అనుమానమే


పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-రాయచోటి

ఇకెవైసి రైతులకు తప్పనిసరి. జిల్లాలో నమోదు అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటికి మూడు సార్లు గడువు పొడిగించినా జిల్లాలో అనుకున్న స్థాయిలో నమోదు ప్రక్రియ సాగలేదు. జిల్లాలో ఇప్పటి వరకు 34.4 శాతంలోపే ఇకెవైసి నమోదైనట్లు సమాచారం. రైతుల అవగాహనా లోపానికి తోడు సాంకేతిక పరమైన ఇబ్బందులు కూడా నమోదుకు ప్రతిబంధకంగా మారాయి. ఇకెవైసి నమోదులో అంతులేని నిర్లక్ష్యం కారణంగా అర్హులందరికీ సాయం అందకుండా పోయే ప్రమాదం కనిపిస్తోంది. ఈ నెల చివరితో ఇకెవైసి గడువు ముగుస్తుందని అధికారులు చెబుతుండటంతో రైతులు ప్రక్రియను పూర్తి చేసుకోని పక్షంలో సాయానికి దూరం కానున్నారు.

పది రోజులే గడువు..

ఇకెవైసి పూర్తి చేసేందుకు గడువు పది రోజులు మాత్రమే ఉంది. ఇందులో రెండు రోజులు సెలవు దినాలు ఉన్నాయి. జిల్లాలో రబీ పంటలకు సంబంధించి సాధారణ విస్తీర్ణం 68,729 ఎకరాలు. 51765.96 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. ఇకెవైసి చేసుకోవాల్సిన రైతులు 28,367 మంది ఉండగా ఇప్పటి వరకు 10,324 మంది రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారు. ఇంకా 18,043 మంది రైతులు నమోదు చేసుకోవాల్సి ఉంది. కేవలం 34.4 శాతం మాత్రమే ఇకెవైసి నమోదైంది. ఇంకా నమోదు చేసుకోవాల్సింది 65.6 శాతం మంది ఉన్నారు. గడువు ఈనెల 28వ తేదీతో ముగుస్తున్నది.

ప్రతిబంధకాలు ఇవీ..

ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరు లేనివారికి ఇకెవైసి ప్రక్రియ జరగడం లేదు. కుటుంబంలో ఒకరికి పిఎం కిసాన్ సాయం అందుతున్నా ఇతర సభ్యులు నమోదు చేసుకోవడం లేదు. విదేశాలలో ఉండడం, వేలిముద్రలు సరిపోకపోవడం వంటి సాంకేతిక కారణాల వల్ల కూడా అనుకున్న స్థాయిలో ఇకెవైసి జరగకపోవడానికి అడ్డంకిగా మారాయి. వీటన్నింటికీ తోడు సరిపడ స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో రైతులకు అవగాహన కల్పించేవారు కరువవడం కూడా ఇబ్బందిగా మారింది. గతంలో అందరికీ ఈ సాయాన్ని కేంద్రం అందించేది. వచ్చే నెలలో అందించే సాయానికి కచ్చితంగా ఇకెవైసి చేయిచుకోవాల్సిందేనని కేంద్రం తేల్చి చెప్పడం, ఇప్పటికీ ఆ ప్రక్రియ 34.4 శాతానికి మించకపోవడం వేలాది మంది రైతులు అందే ఆ కాస్త సాయానికి కూడా దూరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. రైతులు కూడా ఇకెవైసి చేయించుకునే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని వ్యవసాయశాఖ కోరుతోంది. మీసేవా కేంద్రాలలోను, సచివాలయాలలోనూ ఇకెవైసి ప్రక్రియను చేపడుతున్నారని, ఈ విషయంలో ఏవైనా సందేహాలుంటే గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. సాయం విషయంలో ఆందోళన చెందనవసరం లేదని దశలవారీగా ఇకెవైసి చేయించుకున్న అందరి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు.

రైతుందరూ ఇకెవైసి చేసుకోవాలి



ప్రతి రైతూ ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలి. ఇ-క్రాప్ నమోదు చేస్తే ప్రభుత్వం నుంచి రావలసిన పరిహారం, సబ్సిడీ వంటి సదుపాయాలు అందుతాయి. సమసయం ఉందని, రైతులు వెంటనే ఇకెవైసి చేసుకోవాలి.

- ఉమామహేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి, రాయచోటి.

నారా లోకేష్ సభ కోసం స్థల పరిశీలన


పీలేరులో సభ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో మార్చి మొదటి వారంలో జరగనుంది. ఈ సందర్భంగా శనివారం పీలేరు, పులిచెర్ల మండలాల సరిహద్దు ప్రాంతాలను తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి స్థానిక చిత్తూరు రోడ్డులో సభ కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం కార్యదర్శి కోటపల్లి బాబురెడ్డి, పీలేరు మండల టిడిపి అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి మాజీ అధ్యక్షులు అవనాథరెడ్డి యువ నాయకులు లక్ష్మీకర్, రియాజ్ బాష, రమణారెడ్డి, నగరి మడుగు సుభాష్, రాజ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ రాయలసీమజోన్ సమావేశానికి సన్నాహక ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 25న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు కడపలో పర్యటించనున్నారు. సమావేశానికి సన్నాహాలను ఎయిర్‌పోర్టు సమీపంలో శాటిలైట్ టౌన్ షిప్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. ఆ మేరకు సభాస్థలి, భోజనశాల, పార్కింగ్ స్థలాలకు సంబంధించి పనులను చురుకుగా నిర్వహిస్తున్నారు.

నేడు భూతపురి 86వ జయంతి


ప్రజాశక్తి - కడప అర్బన్

'మహాకవి' 'శతావధాని' డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 10 గంటలకు భూతపురి 86వ జయంతి, 21వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ బహుముఖ ప్రతిభాశాలి అని, కవిగా, అవధానిగా, జ్యోతిష వాస్తు శాస్త్రజ్ఞులుగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. 2 శతావధానాలు, సుమారు 160 అష్టావధానాలు చేసి అవధాన రంగంలోనూ తనదైన ప్రత్యేకతను చాటుకున్నారని పేర్కొన్నారు. ఆయన సాహితీసేవను గుర్తించి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందని తెలిపారు. రసజ్ఞులు గజారోహణం, గండపెండేరం, స్వర్ణ హస్తకంకణం వంటి సత్కారాలతో, అవధాన వాచస్పతి, ఉభయ కవిసార్వభౌమ వంటి బిరుదులతో గౌరవించారని పేర్కొన్నారు. పురస్కార గ్రహీత కవిగా, విమర్శకులుగా సుప్రసిద్ధులని, 16 కావ్యాలను, 6 గేయకావ్యాలను, 26 విమర్శ గ్రంథాలను రచించారని తెలిపారు.

టిడిపి ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

అనపర్తిలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడం అవివేక చర్య అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం పీలేరులో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషోర్ మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం టిడిపి నేత సభకు అనుమతులు ఇచ్చినట్టే ఇచ్చి చివరి క్షణంలో రద్దు చేయడం, వాహనాలు అడ్డుపెట్టడం పోలీసులను చంద్రబాబు నాయుడు అడ్డు తొలగండి అంటూ చెప్పినా, పోలీసులు ససేమిరా అంటూ స్పందించక పోవడం దారుణమని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థను ప్రభుత్వం పావులుగా వాడుకుంటూ టిడిపి కార్యక్రమాల్ని అడుగడుగునా అడ్డుకోవడం హాస్యా స్పదంగా ఉందని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు పెట్టినా, ఎలాంటి అవాంతరాలు సృష్టించినా టిడిపి జనసునామీలో కొట్టుకు పోవడం ఖాయమన్నారు. పీలేరు పట్టణంలో ప్రముఖ నాయకులు డాక్టర్ పి.హేమ చంద్రారెడ్డితో పాటు పలు గ్రామస్తులు కిషోర్ కుమార్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన అందరిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎవరూ ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, అందరికీ తాను అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా ముందు ఉంటానని, రాష్ట్రంలో ఇక వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్న భరోసా కార్యకర్తలకు ఇచ్చారు. ఈ నెలలో జరగబోయే నారా లోకేష్ యువ గళం పాదయాత్ర సందర్భంగా కాకులారంపల్లి, వేపులబైలు గ్రామాల్లో సభ కోసం స్థల పరిశీలన చేశారు. అనంతరం పీలేరు నియోజకవర్గంలో మూడు రోజుల పాటు జరిగే పాదయాత్ర సందర్భంగా టిడిపి కార్యకర్తలు, నాయకులు, అనుబంధ సంఘాలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అనపర్తిలో వైసిపి నాయకులు, పోలీసుల తీరును ప్రజలు గమనిస్తున్నారని, పోలీసులే ధర్నాకు దిగడం పోలీసు వ్యవస్థకే మచ్చన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు నల్లారి అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన హేమచంద్రారెడ్డి, గ్రామస్తులు

'స్వప్నమే' — ప్రజా'దృష్టి'

జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు డిమాండ్ నిత్యనూతనత్వాన్ని సంతరించుకోనుంది. కేంద్రంలోని బిజెపి సర్కారు ఫీజుబులిటీ పేరుతో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి దగా చేయడం విశ్వాసఘాతుకం. ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడంలో కీలకమైన ముడిఖనిజాల్లో ముడి ఇనుప ఖనిజం, డోలమైట్ వంటి మూలకాలు జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో పెద్దమొత్తంలో పోగుపడిన సంగతి తెలిసిందే. లాభాల సాధనలో కీలకమైన వనరులు అందుబాటులో ఉండి, ప్రపంచంలో రియల్‌ఎస్టేట్ రంగం మొదలుకుని నిర్మాణ పనుల కార్యకలాపాలు విస్తరించిన నేపథ్యంలో ఉక్కు డిమాండ్ ఏర్పడింది. ఇటువంటి సమయంలో మరిన్ని ఉక్కు పరిశ్రమలను ఏర్పాటు చేయడం ఎంతో కీలకమని సర్వేలు చెబుతుండగా, బిజెపి సర్కారు ఫీజుబులిటీ పేరుతో దోబూచులాడడంలోని మతలబే మిటో తెలియడం లేదు. రాయలసీమ పట్ల ఎంతో ప్రేమను ఒలకబోసి రాయలసీమ డిక్లేషన్ ఆవిష్కరించిన నాయకు లేమయ్యారో తెలియడం లేదు. జాతి భవిష్యత్‌కు సంబంధించిన కీలక అంశాల పట్ల రాజకీయాలు చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. కేంద్ర సర్కారు ఫీజులిటీ అంశాన్నే తీసుకుంటే, ప్రయివేటు పరిశ్రమాధి పతులకులేని ఫీజుబిలిటీ ప్రభుత్వ సంస్థల ఏర్పాటులో ఎందుకు అవసరం ఏర్పడిందో సమాధానం చెప్పాల్సి. రాష్ట్ర విభజనకు ముందే 2009లోనే బ్రహ్మణీ పేరుతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన 40 శాతం పనుల్ని పూర్తి చేసినప్పుడు, ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమను ఎందుకు ఏర్పాటు చేయరో ప్రశ్నించాలి. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుతో సామాజిక న్యాయం సంతరించుకునేదని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ప్రయివేటు రంగంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం వల్ల సామాజిక అంత రాలను మరింత పెంచడానికే తోడ్పడుతుందని ప్రత్యేకంగా చెప్పన వసరం లేదు. ఫీజుబిలిటీ లేనిచోట ప్రయివేటు రంగంలో పరిశ్రమ ఏర్పాటుకు ఎందుకు అనుమతి ఇచ్చిందో చెప్పాలి. బ్రహ్మణీ దగ్గర నుంచి జిఎస్‌డబ్ల్యు పరిశ్రమాధితులు లాభం లేనిచోట పరిశ్రమ కాదు ఒక్క పైసాను కూడా పెట్టుబడిగా పెట్టడానికి ముందుకు రారనే సంగతి జగమెరిగిన సత్యం. ఇటువంటి ఫీజుబులిటీ లేని ప్రాంతంలో ప్రయివేటు రంగానికి వచ్చే లాభాలు, సెయిల్ ఆధ్వ ర్యంలోని ప్రభుత్వరంగ ఉక్కు పరిశ్రమ వంటి సంస్థల ఎందుకు లాభాలు రావో ఆలోచించుకోవాలి. దీన్నిబట్టి మనకు బోధపడే దేమిటి? కేంద్రంలోని బిజెపి సర్కారు యొక్క విధానం ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలకు ఉదారంగా దోచి పెట్టడమనేది బహిరంగ రహస్యం. అందుకే సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం లేదనేది నిర్వివాదాంశం. దేశంలోని 30 రాష్ట్రాలు, ఆరు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అత్యంత వెనకబడిన ప్రాంతమని శ్రీకృష్ణ కమిషన్, శివరామృష్ణన్ కమిటీలు సహా ఇతర సంఘాలు నిర్ధారించిన సంగతి తెలిసిందే. ఇటువంటి వెనుక బడిన ప్రాంతాల్లో శాశ్వత అభివృద్ధి ప్రణాళికల్ని అమలు చేయకుండా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గం. ఇటువంటి పాలకుల విధానాల కారణంగా దేశంలోని 40 శాతం ప్రజల సంపద ఒక్క శాతం కార్పొరేట్ల దగ్గర, మూడు శాతం మంది కార్పొరేట్ల దగ్గర 55 శాతం ప్రజల ఆదాయం పోగుపడిందని మొత్తుకుంటున్నప్పటికీ పట్టడం లేదు. కదలని చలనం లేని పాలకుల నిష్క్రియాపరత్వం కారణంగా సామాజిక అసమానతలు పెచ్చరిల్లుతుండడం విషాదకరం. మహారాష్ట్రలోని ముంబై, కర్నాటకలోని విజయనగర, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన ఉక్కు పరిశ్రమల తరహాలో కడప జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఉక్కు పరిశ్రమకు కీలకమైన ముడిసరుకు కడప, అనంతపురం, పూర్వ ఎపి ప్రాంతమైన బళ్లారిలో ఐరన్‌ఓర్ గనులు, డోలమైట్ వంటి ముడిఖనిజాలు ఉన్న నేపథ్యంలో ఎందుకు ఏర్పాటు చేయడం లేదో ప్రజలే ఆలోచించుకోవాలి. లాభాల్లో నడుస్తున్న ఎల్ఐసి, రైల్వేలు వంటి నవరత్న కంపెనీలను ప్రయివేటు మానిటైజేషన్ పైప్‌లైన్ రూపంలో తెగనమ్ముతోంది. ఇటువంటి కేంద్ర పాలకులు ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తారనుకోవడం ఎండమావుల్లో నీటిని వెతకడం లాంటిదే కదా ఆలోచించండి.

- ప్రజాశక్తి - కడపప్రతినిధి



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ కస్తూరి విశ్వనాథ నాయుడు అన్నారు. శనివారం కస్తూరి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి నల్ల బ్యాడ్జీలు ధరించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరసన తెలియజేసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కస్తూరి మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షాలపై వైసిపి ప్రభుత్వం పోలీసుల ద్వారా విధిస్తున్న నిర్బంధాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వైసిపి ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త మాదినేని విశ్వేశ్వర నాయుడు, మాజీ ఎంపిపి వెంకటేశ్వరరాజు, మాజీ సర్పంచ్ శంకరయ్య నాయుడు, నాయుడోరి రమణ, హస్తి చంద్రరాజు, బాబాసాహెబ్, రాఘవులు నాయుడు, వెంకటరమణ, సుకుమార్, కొమ్మిశెవ, తాజుద్దీన్,జయచంద్ర పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు పంచాయతీ పెద్దూర్ కస్పాలోని బ్రాహ్మణ వీధిలో కనుమరుగై ఉన్న వెంకటేశ్వర ఆలయం దాతల సహకారంతో పూర్వ వైభవం సంతరించుకుంది. ఆలయం పూర్వ దినాలలో ఏవిధారానికి కూడా నోచని స్థితిలో ఉన్న ఈ ఆలయానికి ఆలయ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో రూ.70 లక్షలతో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేశారు. రాయచోటి ఎస్‌పి కుంట, మండలంలోని ప్రతి కుటుంబం ఆలయ అభివృద్ధికి ఆర్థిక భాగస్వాములయ్యారు. ఆంజనేయస్వామి గుడికి యాదయ్య, హేమ కుమార్‌రెడ్డి, మలసాని సుబ్బారెడ్డి సహకారంతో ఆంజనేయస్వామి గుడి నిర్మాణం కూడా పూర్తి చేసినట్లు వారి తెలిపారు.

లోకేష్ పాదయాత్రపై ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తిరుపతి నియోజకవర్గంలో త్వరలో జరుగనున్న లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా నియోజకవర్గంలోని క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, పరిశీలకులతో శనివారం 6వ డివిజన్ పరిధిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యులు సుగుణమ్మ, బీద రవిచంద్ర, నియోజకవర్గం పరిశీలకులు సురేంద్ర కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, పరిశీలకులు విజేత రెడ్డి, బొమ్మన్ శ్రీధర్, అనూరాధ, గాజుల ఖాదర్‌భాషా, కొండ్లపూడి రాఘవరెడ్డి, గుర్రప్ప నాయుడు, నాగేశ్వరరాజు, శ్రీపతి బాబు, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫర్వీన్ తాజ్ మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో యువగళం పాదయాత్రను విజయవంతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.

మల్లయ్య కొండలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల సమీపంలోని వేంపల్లి వద్ద గల మల్లయ్య కొండలో బొమ్మనచెరువు పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.ఫరూక్ ఖాన్ మాట్లాడుతూ ఉదయం నుండి సాయంత్రం వరకు మల్లయ్య కొండకు విచ్చేసిన ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల నందు తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఇంట ర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పరమశివుని నృత్యాలు, పార్వతి పరమేశ్వరుల వేషధారణ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ బి.జయచంద్రారెడ్డి, పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి మహాశివరాత్రి విశేషాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాధా ఎంకె నాయర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి భూమిపూజ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని నంగునూరుపల్లె గ్రామ శివాలయంలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించే కల్యాణమండపానికి శనివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాభివృద్ధే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తన వంతుగా రూ.30 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటిం చారు. అనంతరం శివపార్వతుల కల్యాణమహోత్సవంలో పాల్గొనారు. కార్య క్రమంలో ఎంపిపి సాన బోయిన శేఖర్ యాదవ్, జిల్లా తోటవీరసంఘం అధ్యక్షుడు బండారు సూర్య నారాయణ, భవన నిర్మాణ సొసైటీ బ్యాంకు చైర్మన్ గోపిరెడ్డి రమణయ్య, వైసిపి నాయకుడు కల్లూరు మురళీనాథరెడ్డి, వైపిపి ఇన్‌ఛార్జి యాలం శంకర్ యాదవ్, గ్రామ సర్పంచు లక్ష్మీదేవి వెంకటరాముడు, ఎంపిటిసి క్రిష్టిపాటి సంధ్య, మంజునాథ శర్మ, ఉపసర్పంచు గంగయ్య, దేవాలయ కమిటీ మెంబర్లు డాక్టర్ గుర్రప్ప, నడిపి గురప్ప, బైరీగాని నాగార్జున, బి.నాగముణి, బి.బాలయ్య, రంగయ్య నాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

దేశాన్ని అమ్మేది, కొనేది గుజరాతీయులే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశాన్ని అమ్మేది, కొనేది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారే అని, కేంద్రంలోని బిజెపి ఈ స్థితికి దిగజార్చిందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వినూత్నంగా చేపట్టిన 'హాత్ సే హాత్ జోడో అభియాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కళ్యాణమండపంలో వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు న్యాయవాది జిలాన్ మాట్లాడుతూ దేశప్రజల సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను గుజరాత్‌కు చెందిన ప్రధాని మోడీ, హోం మినిస్టర్ అమిత్‌షా అమ్ముతుంటే.. అదే గుజరాత్‌కు చెందిన అదాని, అంబాని కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీ త్యాగఫలితమే నేటి దేశ అభివృద్ధి తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త మల్లెం విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రధాని మిత్రులు ఇక్కడి బ్యాంకులను లూటీ చేసి విదేశాలకు పారిపోతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు ప్రధాని చేసిన వాగ్దానాలు ఏవీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో జగన్ పాలన తుగ్లక్ పాలనను మరిపిస్తోందని విమర్శించారు. ఇదేమని ప్రశ్నిస్తే పోలీసులతో వేధింపులన్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు క్షేత్ర స్థాయి నుండి బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు దేశభక్తులని, బిజెపి నాయకులు దేశద్రోహులన్నారు. కార్యకర్తల సమావేశం నిర్వహించారు.



ఐక్యత చాటిన కాంగ్రెస్ నాయకులు

శైవక్షేత్రాలు కిటకిట

వాడవాడలా మహాశివరాత్రి ఉత్సవాలు
భక్తులతో కిటకిటలాడిన బండెన్న స్వామి ఆలయం



బి.కొత్తకోట : భక్తులతో పీఠాధిపతి పగడాల లక్ష్మీపతిస్వామి

ప్రజాశక్తి -యంత్రాంగం

శుక్రవారం రాత్రికే శైవక్షేత్రాలన్నీ భక్తులతో నిండిపోవడంతో శనివారం ఉదయం స్వామిని దర్శించుకున్న భక్తుల్లో పలురువు తిరిగి తమ ప్రాంతాలకు చేరుకున్నారు. స్థానికంగా ఉన్న శివాలయాలకు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. మరికొందరు అటవీ ప్రాంతాల్లోని శివాలయాలలో జాగరణ చేస్తే మరింత పుణ్యం అభిస్తుందని భావించి అక్కడే ఉండిపోయారు. ఇంకొందరు శనివారం మధ్యాహ్నం బయలుదేరి అటవీ ప్రాంతాల శైవక్షేత్రాలకు వెళ్లారు.

కలకడ : వాడవాడలా మహాశివరాత్రి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుండి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఆలయ ధర్మకర్త అఖిలేష్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివాహాన్ని కనులారా తిలకించారు. **బి.కొత్తకోట :** మండలంలోని బీరంగి పంచాయతీ, శంకరాపురం వద్ద గుగూట్ట కోనలో వెలసిన బండెన్న స్వామి ఆలయం సందర్శకులతో కిటకిటలాడింది. శనివారం ఉదయం నుంచే జిల్లా పరిధిలో నుంచే కాకుండా, కర్ణాటక నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 131 దేవతామూర్తుల విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి మాట్లాడుతూ ప్రతి ఏడాది మహాశివరాత్రి వేడుకలను ఇక్కడ ఎంతో ఘనంగా జరుపుకునే సంగతి భక్తులకు తెలిసిందేనన్నారు. ఈ ఏడాది మరింత బ్రహ్మాండంగా మహా శివరాత్రి వేడుకలు నిర్వహించామని అన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలతోపాటు సులభంగా స్వామివారి దర్శన కల్పించామని తెలిపారు. అభిషేకాలు,విశేష పూజలు నిర్వహించడం జరిగిందన్నారు.ప్రతి సోమ, శుక్రవారాలలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. **రాజంపేట అర్బన్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. దక్షిణ కాశీగా పేరొందిన అత్తిరాల పుణ్యక్షేత్రంలో శనివారం తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. శివయ్యకు అర్చకులు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల దర్శనానికి అనుమతిని ఇచ్చారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ వెలగచర్ల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అధికారుల సమన్వయంతో భక్తులకు కావలసిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించారు. భక్తులకు త్రాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు వంటి వసతులను ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బ్రహ్మోత్సవ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు. బాహుదానదిలోకి వెళ్లి భక్తులు ప్రాణాపాయానికి గురికాకుండా పటిష్టమైన బారికేడ్లను, పోలీసు సిబ్బందిని నియమించారు. డిఎస్‌పి శివ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇద్దరు సిఐలు, పదిమంది ఎస్ఐలు, 140 మంది పోలీసు బలగాలతో పాటు ఎన్‌సిసి క్యాడేట్లను నియమించి పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు అత్తిరాళ్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అయన వెంట పోలి శివకుమార్, రాము యాదవ్, హరినాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు జీవీ.సుబ్బరాజులు



రాజంపేట : అత్తిరాలలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

పాల్గొన్నారు. **గాలివీడు :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు కుటుంబ సమేతంగా వెళ్లి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. రామలింగేశ్వర ఆలయం, ప్రత్యేక గండి మడుగు ఉమామహేశ్వరాలయం, తూముకుంటలో పెద్ద గొడుగు నోముల బ్రహ్మేంద్రస్వామి దేవాలయాల వద్ద ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. **వీరబల్లి :** మండల వ్యాప్తంగా ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో డి.రాచపల్లి పంచాయతీ మల్లేశ్వర స్వామి పూజారి శంకరయ్య చారి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు సేవా సంఘాలు ఆలయాల వద్ద పాలు, అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. **నిమ్మనపల్లి :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తవళం గ్రామంలోని శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, మండల వైసిపి ఇన్‌ఛార్జ్ ఆర్.ఐ రమణారెడ్డి, ఇఒ మంజుల ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలను నిర్వహించారు. స్వామివారిని మదనపల్లి ఆర్‌డిఒ ఎంఎస్.మురళి, తహశీల్దార్ సిఆర్.మంజుల, ఎంపిడిఒ లీలా మాధవి, నాయకులు రాటకొండ బాబురెడ్డి, పలువురు నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. **మదనపల్లె అర్బన్:** మదనపల్లి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మండలాల్లో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివ నామస్మరణతో శివాలయాలు మారు మ్రోగాయి. శనివారం శివరాత్రి పండుగ సందర్భంగా ఉదయం నుండే పెద్ద ఎత్తున భక్తులు శివాలయాలకు చేరుకొని స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, మొక్కలు చెల్లించుకున్నారు. భక్తుల తాకటిని దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీలు, అధికారులు ప్రత్యేకంగా బార్కెడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక పండుగ వాతావరణంలో శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. శివాలయాల వద్ద భక్తులు రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేకంగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని పుల్లంపేట, అనంతంపల్లి, మొదలగు పంచాయతీలలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతం పల్లె వద్ద కలిసి ఉన్న శివునికి వేద పండితులతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకి తీర్థప్రసాదాలు అందించారు. పూజా కార్యక్రమం అనంతరం గుడ్ల సుబ్బారెడ్డి అన్న ప్రసాదం చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శివ శర్మ, నారపు రెడ్డి శ్రీనివాసులరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, పల్లపు జనార్ధన్, యద్దల మోహన్ మూర్తి, దేసూరి లక్ష్మీనారాయణ రెడ్డి, రెడ్డి రాజు, పోలి చంగల్ రెడ్డి, సిఐటియు మండల అధ్యక్షురాలు వనజ కుమారి పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మండలంలోశివరాత్రి పర్వదిన మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. పెద్దమండ్యం లో శుశావతి నది తీరాన వెలచిన శ్రీ భవాని శంకర్ ఆలయములో, పాపేపల్లిలో శివాలయంలో, ముసలీకుంట, తాటిమకూలపల్లి, శివపురం నెలమల్లయ్య శివాలయాలలో శివలింగానికి వివిధ పుష్పలతో, అలంకరించి, పంచామృతముతో, వేదమంత్రాలతో శనివారం అభిషేకం చేశారు. మల్లయ్య స్వామి వద్ద భక్తులు సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలోరెండు రోజులు అన్నదనాకార్యక్రము, తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నారా రామచంద్ర య్య, ఎంపిపి పూర్ణచంద్రిక రమేష్, సర్పంచ్ భాష, ఉపసర్పంచ్ గాజుల సుధాకర్, ఆలయ అర్చకులు మణికంఠ శర్మ, ప్రసాద్ స్వామి,పణి కుమార్ స్వామి,గోపి స్వామి,సాయి గుణస్వామి,పవన్ స్వామి,కృష్ణమూర్తి స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాధనం నిరుపయోగం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని సంజామల మోటు దగ్గర ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ నిర్మాణం దాదాపు రూ.6.50 లక్షలతో ఏర్పాటు చేశారు. ఇది ప్రజలకు నిరుపయోగంగా మారింది. కరోనా నేపథ్యంలో కూరగాయల మార్కెట్‌ను పట్టణంలోని నలుమూలల విస్తరింపజేశారు. ఇందులో భాగంగా సంజామల మోటులోని ప్రభుత్వ స్థలంలో ప్రజాధనంతో మున్సిపల్ అధికారులు నూతన మార్కెట్‌ను నిర్మించారు. దీన్ని గతేడాది ఏప్రిల్ 7న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి మార్కెట్ నిర్వాహకులు వారికి కేటాయించిన ప్రాంతంలో కూరగాయలను విక్రయించడం లేదు. కానీ నూతనంగా నిర్మించిన మార్కెట్‌కు ఎదురుగా ప్రయివేట్ స్థలాల్లో, బండ్లపైన ప్రధాన రోడ్డు పక్కన ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ కూరగాయలను విక్రయిస్తున్నారు. దీంతో ప్రజల సొమ్మును వెచ్చించి కట్టిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారింది. నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ వ్యర్థాలతో నిండిపోయింది.



నిరుపయోగంగా ఉన్న మార్కెట్ ప్రదేశం

ఆవులకు, పందులకు నిలయంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మార్కెట్ నిర్వాహకులకు కేటాయించిన స్థలాల్లో కూరగాయలను విక్రయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దిగజారుతున్న ప్రజాస్వామ్యం : టిడిపి



జమ్మలమడుగులో నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం రోజురోజుకూ దిగజారిపోతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం అనపర్తిలో చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యతిరేకమన్నారు. 14 నెలల్లో ముఖ్యమంత్రి ఇంటికెళ్లనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయన్నారు. ప్రతిపక్షం లేకుండా పాలన సాగించాలనుకోవడం ప్రభుత్వానికైనా సరైందికాదన్నారు. అధికార, ప్రతిపక్షం ఉంటేనే ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. పోలీసులు కూడా చూసుకొని ఆంక్షలు విధించాలన్నారు. ఎప్పుడు ఒకే ప్రభుత్వం ఉండదని గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును అధికారులు, ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, ఎస్‌టి నాయకులు హనుమంతు నాయక్, కిరణ్ రాయల్, వెల్డింగ్ గైబు, సర్దార్, పొన్నతోట బ్రదర్స్ శ్రీను, మల్లి, తులసిరెడ్డి, నెల్సన్, రఫీ, శివారెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. అనపర్తిలో టిడిపి అధినేత చంద్రబాబు రోడ్‌షోను పోలీసులు అడ్డుకున్నందుకు నిరసనగా శనివారం రామమునిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలు నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఈ ప్రభుత్వ ఆరాచాకాలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు మేదర రవికుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, ఉపాధ్యక్షుడు వీరభద్ర, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి పూల అల్లాబక్షు, డక్కా రమేష్, గొగుల మల్లికార్జున, యుగంధర్, యూనిట్ నెంబర్ గిరిధర్‌రెడ్డి, మడక శ్రీను, మైనార్టీ కార్యదర్శి సైఫుల్లా, రామాంజనేయులు, ఈశ్వరయ్య, మారుతీ పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడే సందడి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

శివరాత్రి పర్వదిన సందర్భంగా శనివారం శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఫాతిమా మెడికల్ స్టోర్, పులి వెందుల పాలగిరి ప్రదీప్ (పి.అర్) సియోన్‌పురం సౌజన్యంతో అంకాలమ్మ మెమోరియల్ హైస్కూల్, వేల్పుల గ్రామానికి చెందిన చిన్నారులచే శ్రీ చిట్టి డ్యాన్స్ మాష్టర్ అధ్వర్యంలో జనపదం, వెస్టన్ నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : స్థానికంగా ఉన్న 'మే ఐ హెల్ప్‌యు ఫౌండేషన్' నిర్వాహకులు శనివారం అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రొద్దుటూరు ఆటోనగర్‌లో ఉన్న రామకృష్ణ అనే అనాథ అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానికులు ఫౌండేషన్ చైర్మన్ లక్షణ్‌మోరేను సంప్రదించారు. వెంటనే స్పందించి హిందూ శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో సిఇఒ మల్లికార్జున, ప్రొద్దటూరు అధ్యక్షుడు కామనూరు శివసాయినాథ్, తాళ్లమాపురం, సుబహాన్, సుబ్బయ్య పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో ముక్కా రూపానంద రెడ్డి

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని పెద్దవరంపాడు లోని గౌరీ సిద్దేశ్వర దేవస్థానంలో ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదివేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానంద రెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయి వికాస్‌రెడ్డిలను ఆలయ పూజారి, గ్రామస్తులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. రూపానందరెడ్డి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాన ఎంతో గొప్పదని, శివరాత్రి పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఉత్సవాలలో ఏర్పాటు చేసిన చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైసిపి నాయకులు ముక్కా మధుసూదన్ రెడ్డి, పాపూరు రామిరెడ్డి, తల్లెం చంద్రమోహన్‌రెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.



జాతరలోని ప్రత్యేక క్యూ లైన్లు పరిశీలిస్తున్న సిఐ వరప్రసాద్

జాతర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో ఈనెల 21, 22 తేదీల్లో జరుగబోవు గంగమ్మ జాతర ఏర్పాట్లను సిఐ వరప్రసాద్, ఎస్ఐ వినోద్‌కుమార్‌లు శనివారం పరిశీలించారు. శివరాత్రి పర్వదినం ముగిసిన వెంటనే భక్తులు గంగమ్మ జాతరకు చేరుకుంటారని, జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సిఐ ఆలయ కమిటీ సిబ్బందికి సూచించారు. ఇప్పటికే ప్రత్యేక క్యూలైన్లు, వాహనాల పార్కింగ్, ఆర్‌టిసి బస్సుల పార్కింగ్, చిరు వ్యాపారుల స్థలాలను ఆయన పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామాల నర్సింహారెడ్డి, ఇఒ రవీంద్రరాజు, ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకొస్తే 'ఆరు సూత్రాలు' అమలు

ప్రజాశక్తి - మైలవరం

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఆరు సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తుందని పిసిపి మీడియా సెల్ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. మండలంలోని జి.ఉప్పలపాడు గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు..ఈ సం దర్భంగా అక్కడ అభయాంజనేయ స్వామి గుడి దగ్గర పూజ చేశారు. అనం తరం తులసిరెడి మాట్లాడుతూ రాష్ట్ర సర్వతో అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తోడ్పడుతుందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు లక్షల రూపాయల వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తా మన్నారు. గ్యాస్ సిలిండర్ రూ.500కే పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.6000 ఆర్థికసాయం అంది స్తామన్నారు. ప్రత్యేకహోదా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్య శర్మ, మైలవరం మండలశాఖ అధ్యక్షులు శ్రీని వాసులు, జానకిరామ్, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, శివయ్య పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలోని మోటునూతలపల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ కోనగవేశ్వర స్వామి క్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం దేశవు ఎద్దుల బండలాగుడు పోటీలను ఆలయ నిర్వహకులు ఓబుల్‌రెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ.25వేలు రెండో బహుమతి రూ.20వేలు, మూడవ బహుమతి రూ.15వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు ఐదో బహుమతి రూ.8 వేలు, ఆరో బహుమతి రూ.5వేలు, ఏడో బహుమతి మూడు వేల రూపాయలు నగదును భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల వారు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాటవారిపల్లెలో ఘర్షణ : కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

ఇరువర్గాలు ఘర్షణ పడగా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ పోతువారిపల్లి వద్దనున్న శృతి పాలడైరీ భూముల విషయంలో మల్లికార్జున నాయుడు, బాలాజి, వెంకటరమణ, శెట్టిపల్లి చంద్ర ఒక వర్గంగా, చిత్తూరుజిల్లా, సదుం మండలము, బూరగమంద పంచాయతీ, గాండ్లపల్లి గ్రామంలో నివాసమున్న బీధన పెద్ద రెడ్డెప్ప, జగన్ మోహన్, సుధాకర మరో వర్గంగా ఏర్పడి ఘర్షణ పడినట్లు తెలిపారు. ఈ ఘర్షణలో ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిని గాయపరిచిన ఐదుగురిపై కేసు

ప్రజాశక్తి-కలకడ

వ్యక్తిని గాయపరిచిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని గంగాపురం సమీపంలో ఉన్న చెరువు వద్ద కలికిరి మండలము, గుండ్లూరు గ్రామమునకు చెందిన శరత్ అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేసే వాడని తెలిపారు. ట్రాక్టర్ పని చేసినందుకు కూలి డబ్బులు అడిగినందుకు కె.వి.పల్లి మండలము, తిమ్మాపురం గ్రామమునకు చెందిన రామ్మోహన, మురళి, సాయి ప్రసాద్, నాగరాజ, రామయ్య అనే ఐదురుగు దాడి చేసి దూషించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని గోరాన్ చెరువు వద్ద శుక్రవారం ఆర్‌టిసి బస్సు, ఆటో ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ మహబూబ్‌బాషా(40)ను శనివారం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృత దేహాన్ని లక్కిరెడ్డిపల్లి ఆస్పత్రికి తరలించి శవ పరీక్ష అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్న గాయపడిన తొమ్మిది మందిలో శనివారానికి తండ్రి, కొడుకులు మృతి చెందారు.